సంత మార్కెట్‌కు గ్రహణం

- 6 నెలలుగా నిరుపయోగంగా కోటపేట సంత మార్కెట్
- రహదారికి ఇరువైపులా కాయగూరల విక్రయం
- కాలనీ వాసులకు తీవ్ర ఇక్కట్లు
- పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు



కోటపేటలో రూ.45 లక్షలతో నిర్మించిన సంత మార్కెట్ షెడ్డు



రహదారికి ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

బేతంచెర్ల: నగర పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపించడం, నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని కోటపేటలో రూ.45 లక్షలతో నిర్మించిన సంత మార్కెట్ నిరుపయోగంగా మారింది. దీనికి తోడు వ్యాపారులు మార్కెట్ యార్డులో గాకుండా రహదారికి ఇరువైపులా కాయగూరలను ఉంచి విక్రయిస్తుండడంతో కాలనీవాసులకు ఇబ్బందిగా మారింది.

పట్టణంలోని కోటపేటలో ప్రతి ఆదివారం నిర్వహించే సంత మార్కెట్‌కు సరైన సౌకర్యం లేక వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. మండుటెండలో ఉక్కపోత భరిస్తూ, వర్షమొస్తే తడుస్తూ తీవ్ర ఇక్కట్ల మధ్య కూరగాయలు, ఆకుకూరలు విక్రయించేవారు. వారి ఇబ్బందులను గుర్తించి పట్టణ ప్రజలతో పాటు వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి 2021 అక్టోబర్ 24న సంతమార్కెట్ ఏర్పాటుకు రూ.45 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో మార్కెట్ యార్డును 60 స్టాల్స్‌తో నిర్మించారు. మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. 2022 సెప్టెంబర్ 30న సంతమార్కెట్ షెడ్డును ప్రారంభించారు. దీంతో వ్యాపారులకు, పట్టణ ప్రజలకు సౌకర్యంగా ఉండేది. అయితే గత 6 నెలలుగా నగర పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు కోటపేటలో రహదారికి ఇరువైపులా కాయగూరలను ఉంచి సంత నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో పాటు కాలనీవాసుల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి సంత మార్కెట్ షెడ్డులో వ్యాపారాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. లేకపోతే లక్షల రూపాయలతో ఆధునీకరించిన సంత మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారడమే కాకుండా కోటపేట, డ్రైవర్స్ కాలనీ వాసులకు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని వాపోతున్నారు.

రసీదు ఇవ్వకుండా అక్రమ వసూళ్లు

నగర పంచాయతీ నిబంధనల మేరకు కోటపేటలో నిర్వహించే సంతమార్కెట్‌లో వ్యాపారుల నుంచి సుంకం రూ.90 వసూలు చేయాల్సి ఉండగా సదరు హక్కులను వేలంలో దక్కించుకున్న కాంట్రాక్టర్ రశీదు ఇవ్వకుండా రూ.100 నుంచి 150 దాకా వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వ్యాపారాలు లేక, తెచ్చిన సరుకు అమ్ముడుపోక ఇబ్బందులు పడుతున్న తమను కాంట్రాక్టర్ అధికంగా డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండడంతో దిక్కుతోచడం లేదని వాపోయారు. అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

6 నెలలుగా వ్యాపారులు రావడం లేదు



సంతమార్కెట్‌లోకి గత 6 నెలలుగా వ్యాపారులు రావడం లేదు. నాతో పాటు ముగ్గురు మాత్రమే మార్కెట్లో వ్యాపారాలు నిర్వహించుకుంటున్నాం. గతంలో రోడ్డు పక్కన తీవ్ర ఇక్కట్ల మధ్య కాయగూరలు విక్రయించుకునే వాళ్లం. ప్రస్తుతం సౌకర్యంగా ఉన్న సంత మార్కెట్ యార్డును వదిలి రహదారి పక్కనే వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఎక్కువ మంది రోడ్డు పక్కనే కూరగాయలు విక్రయిస్తుండటంతో వినియోగదారులు సైతం యార్డు వైపు రావడం లేదు. – ఇమామ్ సా, వ్యాపారి

సంత రోజు ఇబ్బందే



సంత జరిగే ఆదివారం రోజున వ్యాపారులు కోటపేట కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా కాయగూరలను ఉంచి విక్రయిస్తుండటంతో కాలనీ వాసులకు ఇబ్బందికరంగా ఉంది. తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వ్యాపారులు, అధికారుల తీరుతో అన్ని రకాల సౌకర్యాలతో నిర్మించిన మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారింది. అధికారులు చొరవ తీసుకొని సంత మార్కెట్ యార్డులోకి వ్యాపారులు వచ్చేలా కృషి చేస్తే సౌకర్యంగా ఉంటుంది. – ఇబ్రహీం, కోటపేట కాలనీవాసి

క్లుప్తంగా

క్రీడా సామగ్రి పంపిణీ



రాష్ట్ర ఆటగాళ్లకు క్రీడాదుస్తులు అందిస్తున్న సీఐ ఇంతియాజ్

డోన్: కర్ణాటక రాష్ట్రం బళ్లారి పట్టణంలో గురువారం జరిగే జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జట్టు సభ్యులు.. డోన్ పట్టణంలో గత పది రోజుల నుంచి పాల్గొంటున్న శిక్షణ శిబిరాన్ని ముగించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్అండ్‌బీ వసతి గృహంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్ రాష్ట్ర జట్టు సభ్యులకు షూస్, టీషర్టులు, బ్యాట్‌లను పంపిణీ చేశారు. కోచ్ కేఈ మౌలా, జట్టు మేనేజర్ రైల్వే ప్రకాష్‌తో పాటు జాతీయ స్థాయి ఆటగాళ్లు రషీద్, రామ్మోహన్, కామేష్, జాకీర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ విరాళం



వాటర్ కూలర్‌ను విరాళంగా అందజేస్తున్న దాత

డోన్: వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని డోన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో రోగుల దాహార్తిని తీర్చేందుకు ప్యాపిలి మండలం బావిపల్లె సర్పంచ్ లింగన్న వాటర్ కూలర్‌ను బుధవారం విరాళంగా అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, సర్పంచ్ లింగన్న, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగరాణి, డాక్టర్ సాయి, ప్రసాద్, దాము తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

డోన్: కలచట్ల శివారు ప్రాంతంలోని నాటుసారా స్థావరాలపై బుధవారం ప్యాపిలి పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ మధుసూదన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సారాబట్టీల వద్ద నిల్వ ఉంచిన 2 వేల లీటర్ల బెల్లం ద్రావణాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

డోన్: స్థానిక బాలుర వసతి గృహం వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని సర్వజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ బుధవారం డిమాండ్ చేశారు. వసతి గృహంలో 65 మంది విద్యార్థులకుగాను 33 మంది మాత్రమే ఉన్నట్లు తెలిపారు. మెనూ పాటించకుండా వార్డెన్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్ని ఆధారాలతోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం

కొలిమిగుండ్ల: అబ్దులాపురంలో ఉన్న భూమి వారసత్వంగా తమకు రావడంతో అన్ని ఆధారాలతోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన జూటూరు శేఖర్‌బాబు బుధవారం తెలిపారు. హైదరాబాదులో ఉంటున్న జూటూరు ఏసుదాసు భూమిని అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్నామని ఆయన కుమారుడు స్వామిదాసు అధికారులకు ఫిర్యాదు చేశాడని, ఇందులో నిజం లేదన్నారు. 2024 ఫిబ్రవరి 15న తనకు చెందిన ఆస్తి 5.08 ఎకరాలను కుమారుడు ప్రవీణ్ పేరున అవుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అన్ని ఆధారాలతో సెటిల్‌మెంట్ కింద చేయించామన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

డోన్ రూరల్: కల్లు గీత కార్మికులకు మద్యం దుకాణాల దరఖాస్తు గడువును ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్మిక చట్టాలను పరిరక్షించాలి

డోన్ టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కొనసాగించే వరకు కర్షకులు, కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయు నాయకులు పిలుపునిచ్చారు. అలాగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయు నాయకులు నక్కి శ్రీకాంత్, భాస్కర్ రెడ్డి, చిన్న రహిమాన్ తదితరులు ఉన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం చేసి నిరసన

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులను పూర్తిగా విస్మరించారని ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామంలో మండల కార్యదర్శి రామ్‌మోహన్, గౌరవాధ్యక్షుడు కిష్టన్న ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ల కోసమే తప్పా, రైతాంగానికి, పేద ప్రజానీకానికి ఉపయోగకరంగా లేదని విమర్శించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై నేడు సమీక్ష

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని పొదుపు భవనంలో గురువారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ చంద్రుడు బుధవా రం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సమీక్ష సమావేశం ప్రారంభమవుతుందని, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్

బనగానపల్లె రూరల్: పట్టణంలో దోమల నివారణకు బుధవారం రాత్రి పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. ఆంజనేయస్వామి ఆలయం వీధి, ఈద్గా నగర్, పోలీస్ క్వార్టర్స్, రాజునగర్ ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు. ఫాగింగ్ కార్యక్రమాన్ని మండల ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ, పంచాయతీ ఈఓ సతీష్ కుమార్‌రెడ్డి పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

10న నులిపురుగు నివారణ దినోత్సవం

కొలిమిగుండ్ల: పిల్లల్లో రక్తహీనతను నివారించేందుకు ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హరిచరణ్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల లోపు వారికి నులి పురుగుల నివారణ మందులు వేస్తామన్నారు. మండలంలో 8,600 మందికి వేసేందుకు సిద్ధం చేశామన్నారు. 10వ తేదీ అనివార్య కారణాలతో వేయించుకోని వారి కోసం 17వ తేదీన వేస్తామని చెప్పారు.

సేవా గుణం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి చెప్పారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెల అందజేసే పింఛన్ల ప్రక్రియను బుధవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పింఛన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి ప్రతి నెల పేదలకు తమ వంతు సాయంగా పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి పీఠం ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, సభ్యులు సుబ్బయ్య, రాములమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీఓ క్రాంతికుమార్

డోన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం ఆర్‌టీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టీఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. చిన్న వయసులోనే వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

చెరువులోకి దూసుకెళ్లిన కంటైనర్



డోన్: మండల పరిధిలోని వెంగళాంపల్లి సమీపంలో ఎన్‌హెచ్–44పై బుధవారం కంటైనర్ అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. బెంగళూరు నుంచి హైదరాబాదు వైపు హిటాచీని తరలిస్తున్న కంటైనర్ వెంగళాంపల్లి చెరువు వద్దకు రాగానే డ్రైవర్ సడెన్ బ్రేకు వేశాడు. దీంతో కంటైనర్‌పై ఉన్న హిటాచీ జారి రోడ్డుకు అడ్డంగా పడింది. ఈ కుదుపులకు అదుపుతప్పిన కంటైనర్ చెరువులోకి దూసుకెళ్లింది. అయితే ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

విద్యార్థులకు శాలువాల పంపిణీ



మోడల్ స్కూల్ విద్యార్థులతో వివేకానంద సేవాసమితి సభ్యులు

డోన్: విద్యార్థులు రేపటి నవ సమాజ నిర్మాతలని, ఉక్కు సంకల్పంతో అనుకున్న లక్ష్యాలను నెరవేర్చి విద్యలో అత్యున్నత స్థానానికి ఎదగాలని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు జగన్‌మోహన్, కార్యదర్శి నాగభూషణంరెడ్డి అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ 9, 10 తరగతులు, ఇంటర్మీడియెట్ విద్యార్థులు 118 మందికి వివేకానంద సేవాసమితి వారు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.30 వేల విలువ చేసే శాలువాలను బుధవారం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ కేశిరాజ్ శ్రీనివాస్, సమితి సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



బేతంచెర్లలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. బుధవారం దేశవ్యాప్త నిరసనలో భాగంగా పట్టణంలో సీఐటీయూ కార్యాలయం నుంచి వివిధ కార్మిక సంఘాలతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రకాశ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్‌కు అనుకూలంగా మార్చే విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడి ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం కాలరాయాలని చూస్తోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులు కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ సూచించారు. ఆయన బుధవారం స్థానిక కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేసి 50 మందికి ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మేట్‌ను నియమించుకోవాలన్నారు. ఈ శ్రమ్ ద్వారా పనికి హాజరయ్యే ప్రతి వేతనదారుడు ఇన్సూరెన్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి గ్రామ పంచాయతీలో 5 ఫారం పాండ్స్ తవ్వించాలన్నారు. కుంటలలో పూడిక తీసే పనులను గుర్తించాలన్నారు. ఏపీఓలు శేషన్న, హనీఫా, ఈసీ సుబ్బానాయక్ పాల్గొన్నారు.

వంద పనిదినాలు పూర్తి చేయాలి

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఈ ఏడాది మార్చి నెలాఖరునాటికి వంద పనిదినాలు పూర్తిచేయాలని ఏపీఓ శ్రీవిద్య సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో మండలంలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనులు పూర్తి కావస్తున్న దృష్ట్యా గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 70 నుంచి 80 పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలకు వంద పనిదినాలు కల్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు జయభారత్‌రెడ్డి, కొండారెడ్డి, ఫకృద్దీన్, రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కోవెలకుంట్ల: గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించేందుకు దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడగించినట్లు ఎక్సైజ్ సీఐ తకీబాషా తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గీత కార్మికులకు 11 మద్యం దుకాణాలు కేటాయించగా కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉయ్యాలవాడ మండలానికి ఒక దుకాణం కేటాయించారన్నారు. బుధవారం సాయంత్రంతో దరఖాస్తుల స్వీకరణ ముగియనుండగా ప్రభుత్వం ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు పెంచిందన్నారు. ఎస్ఐలు సందీప్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొలిమిగుండ్ల: ఇటిక్యాల సమీపంలోని ప్రధాన రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. అవుకుకు చెందిన దూదేకుల బుజ్జమ్మ, బుజ్జి బొలెరో వాహనంలో తాడిపత్రి వైపు నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో జమ్మలమడుగు ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు వెనుక నుంచి జీపును ఢీకొనడంతో ఇరువురు స్వల్పగాయాలతో బయట పడ్డారు. చికిత్స కోసం ఇరువురిని ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

డోన్ టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములు ఆరోపించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో.. ఎల్ఐసీలో వంద శాతం ఎఫ్‌డీఐని అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక బ్రాంచి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 నుంచి 100 శాతానికి పెంచడం బీమా రంగానికి, పాలసీదారులకు నష్టం కలుగజేస్తుందన్నారు. పాలసీదారులకు సకాలంలో చెల్లింపులు చేస్తూ దేశాభివృద్ధికి నిధులను అందిస్తున్న ఎల్ఐసీని దెబ్బతీసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. వంద శాతం ఎఫ్‌డీఐని అనుమతించే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని లేకపోతే ఉద్యోగులతో కలిసి ఉద్యమాలకు దిగుతామని స్పష్టం చేశారు. ఏజెంట్లు జయన్న, నాగేంద్ర, రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

బనగానపల్లె: పురుగుమందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపారు. నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన గౌర చిన్నఆంజనేయులు(38) కూలీ పనులు చేసుకుని జీవనం గడిపేవాడు. వచ్చిన కూలీ మొత్తం మద్యానికి ఖర్చు చేసేవాడు. మద్యం మానుకోలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం క్రిమిసంహారక మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య గౌరసుబ్బనీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు.

స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలి



పలుకూరులో రుణాలు పొందిన వారితో మాట్లాడుతున్న జీఎం ఉమామహేశ్వర్

బనగానపల్లె రూరల్ : పొదుపు సంఘాల్లోని మహిళలు స్త్రీనిధి పథకం కింద తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని స్త్రీ నిధి పథకం జనరల్ మేనేజర్ ఉమామహేశ్వర్ సూచించారు. గురువారం మండలంలో పలుకూరు, దేవనగర్, రామక్రిష్ణాపురం, బీరవోలు గ్రామాల్లో స్త్రీనిధి పథకం కింద రుణాలు తీసుకొని సక్రమంగా చెల్లించని డ్వాక్రా సంఘాల మహిళల వద్దకు వెళ్లి మాట్లాడారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం వల్ల మరింత మంది మహిళలకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని, వీలైనంత త్వరగా రుణాలను చెల్లించాలనికోరారు.కార్యక్రమంలో స్త్రీనిధి పథకం అధికారి రమేష్, ఏపీఎం అద్దాకుల శ్రీనివాసులు, బుక్‌కీపర్లు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల విజేత బేతంచెర్ల వృషభాలు

తుగ్గలి: బాబా మస్తాన్‌వలి స్వామి ఉరుసు సందర్భంగా మారెల్లలో బుధవారం బండలాగుడు పోటీలను ప్రారంభించారు. పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో చేదోడుగా ఉంటున్న పశువులను రైతులు సంరక్షించుకోవాలన్నారు. హోరాహోరీగా జరిగిన బండలాగుడు పోటీల్లో బేతంచెర్ల భానుజ వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో డొర్నిపాడు, దాసరిపల్లి బత్తుల మనోహర్, దేవరాజునాయుడు వృషభాలు, మారెల్ల వడ్డే పరమేష్, జొన్నగిరి అద్దంకి మస్తాన్, బోయినపల్లి నరసింహారెడ్డి, పందిర్లపల్లి ఖలీల్‌బాషా వృషభాలు నిలిచాయి. ఎద్దుల యజమానులకు వరుసగా దాతల సహకారంతో రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందజేశారు.

వాట్సాప్ ద్వారా ఆలయ గదుల బుకింగ్

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో గదుల బుకింగ్ కోసం వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఉప కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 83339 07851 వాట్సాప్ నంబర్‌కు పూర్తి పేరు, మొబైల్ నంబర్, జిల్లా, మండలం, గ్రామం పేరు తదితర సమాచారం పంపి గదులను బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: బీసీ కులాల యువకులు స్వయం ఉపాధి రంగాలలో రాణించేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ బుధవారం తెలిపారు. అర్హులైన వారు క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్, రేషన్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుబుక్, విద్యార్హత సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఒక సెట్‌ను సచివాలయం, ఇంకొక సెట్‌ను బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. లోన్ యూనిట్ కాస్ట్ స్లాబ్ -1 లో రూ.2లక్షలు, స్లాబ్-2లో రూ.3 లక్షలు, స్లాబ్-3లో రూ.5 లక్షలు ఉంటుందన్నారు.

పాఠశాలను విలీనం చేయొద్దు



విద్యార్థులతో కలిసి ఆందోళన వ్యక్తం చేస్తున్న దృశ్యం

డోన్: ప్యాపిలి మండల పరిధిలోని వెంగళాంపల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలను మెయిన్‌పాఠశాలలో విలీనం చేయడం తగదని కాలనీవాసులు నాగమద్దయ్య, శీలమ్మ, రాజమ్మ, రమాదేవి తదితరులు అన్నారు. ఈ మేరకు బుధవారం కాలనీవాసులు, విద్యార్థులతో కలసి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు.పాఠశాల విలీనాన్ని ఆపాలని కోరుతూ ఎంఈఓ, డీఈఓలకు లేఖను పంపారు.

మిల్లులకు లైసెన్స్ తప్పనిసరి

నంద్యాల(అర్బన్): దాల్‌మిల్ యజమానులు మార్కెట్ కమిటీ నుంచి లైసెన్స్ తీసుకోకపోతే చర్యలు తప్పవని రీజనల్ మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ రెహమాన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పనతో కలిసి బుధవారం పట్టణంలోని మిల్లులను ఆకస్మిక తనిఖీ చేశారు. లైసెన్సులు లేని యజమానుల నుంచి మార్కెట్ సెస్ కింద రూ.5.85 లక్షలు వసూలు చేశారు.

చెడు అలవాట్లను త్యజిస్తేనే ఆరోగ్యం



ప్రసంగిస్తున్న రెవరెండ్ నిత్యానందం



మెస్సీయ ప్రార్థన సమావేశంలో పాల్గొన్న క్రైస్తవులు

డోన్: ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలను త్యజిస్తేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించగలుగుతారని మెస్సీయ గాస్పల్ మినిస్ట్రీస్ రెవరెండ్ నిత్యానందం అన్నారు. స్థానిక క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌లో మెస్సీయ ప్రార్థన పండుగ బుధవారం బ్రదర్ లాజరస్, జోయల్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమైక్య కమిటీ సంస్థ కార్యదర్శి సాలోమెన్, సంస్థ నాయకులు ప్రభాకర్, ఇసాక్, రాజశేఖర్ ప్రసంగించారు. క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు ఆలాం, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు బ్రదర్ జోయల్‌ను సత్కరించి మొమెంటో అందజేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

డోన్: సొంతిల్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.సుంకయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో బుధవారం సీపీఐ పట్టణ కార్యదర్శి మోటారాముడు ఆధ్వర్యంలో పేద ప్రజలతో దరఖాస్తులు తీసుకొనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా సూపర్ సిక్స్ పథకాలు ఒక్కటి కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి షిరిన్ తదితరులు పాల్గొన్నారు.